# కామధేను

## శ్రీ శ్రీవత్స

ఈమారు మద్రాసు వచ్చినప్పటినుంచీ ప్రతివాళ్ళతోనూ వాగ్వాదంలోకి అప్రయత్నంగా దిగవలసివస్తూవుంది.

ఉదయం 9 గంటలనుంచి పెద్దలు చేసే పెళ్ళిళ్ళు యోగ్యమా స్వయంగా కామించి చేసుకొన్న పెళ్ళిళ్ళు యోగ్యమా అనే వాగ్వాదంలో మిత్రులమంత్తా మునిగి తేలుతున్నాము.

ఎవళ్ళేమి చెప్పినా నావొక్కటేవాదం! ఎవరంతట వాళ్లు కామించి పెళ్లి చేసుకొనేట్లయితే నాబోటి అందమయినవాళ్లను ఏ ఆడది పెళ్లి చేసుకుంటుంది?—అందువల్ల పెద్దలు పెళ్లి చేస్తేనే మంచిదీ అని వాదించి వాదించి గొంతు బొంగురు పోవడమే కాకుండా ఆకలి దహించుకొనిపోతూవుంటే దగ్గరలోవున్న ఏ కాఫీహోటలుకయినా వెళ్లుదామని చూసేసరికి అయిదయింది. ఇక దగ్గిరలో ఎక్కడికయినా పోయి యింతతింటే తర్వాత యీ దేహాన్ని 'బీచి' దాకా జేరవేయడం చాలా శ్రమ అవుతుందనుకొని బీచి దగ్గిరవున్న ఆక్వారియం హోటలుకే పోతే ఏచిక్కూ వుండదనుకొని బయలుదేరాను.

ఇంకా బల్లమీదికి ఏమీ రానే లేదు. నాకళ్లమీదికి ఎవరివో చేతులుమాత్రంవచ్చి మూసి వేసినవి. పెద్దవాణ్ణి అయిపోయినాను. పరస్థలం, పయిగా బజారులాంటి కాఫీ హోటలులో యీ వేళాకోళం ఎవడో చేస్తుంటే ఎంతయినా వళ్లు మండిపోతుంది. ఆ రెండు చేతులను విదిలించి అవతల పారవేశాను. అమాంతం లేచిచూశాను. నిర్ఘాంతపోయినాను.

'జక్కరయ్య'

జక్కరయ్యనుచూసి యిప్పటికి ఆరుసంవత్సరాలయిందనుకొంటాను. వాడు పుట్టడమయితే క్రైస్తవులయింట్లో పుట్టాడు. కాని వాణ్ణిచూస్తేమటుకు ఎవరూ వాణ్ణి క్రియస్టియన్ అని అనుకోరు. అసలువాడు ఏజమిందారుయింట్లోనో పుట్టి వుండవలసింది. అయినా జమిందార్లలో అంత అందమయినవాణ్ణి నేను ఎక్కడా చూడలేదు... నాకెప్పుడూ ఒకటే ఆశ్చర్యము—వాడికటువంటి చక్కని రంగు ఏట్లావచ్చిందా అని.

జక్కరయ్య పకపకనవ్వుతూ "ఏం మామా - ఆబ్బ ఎన్నాళ్లయింది నిన్నుచూసి" అన్నాడు.

"అవునురా - కాలేజీవదలిపెట్టిన తర్వాత మళ్లీ మనం కలుసుకోలేదు...ఆరుసంవత్సరాలయిందనుకొంటాను... అయితే యిక్కడవుంటున్నావాఏంరా" అన్నాను.

"అవును యిక్కడ కాలేజీలో ప్రొఫెసరుగా వుంటున్నాను"

"అయితే కాస్త కాఫీగీఫీ పుచ్చుకోవు" అని అవీ ఇవీ తిని బయటికి బయలుదేరాము

"ఏమిరా మామా మాయింటికి రావా?" అన్నాడు.

"ఎక్కడ మీయిల్లు-ఎంతదూరం వుంటుంది యిక్కడనుంచి?"

శాంథోమ్‌లో - ఒకమయిలుదూరం వుంటుంది... మామా నేను పెళ్లి చేసుకొన్నాను...ఒక ఏడాది ఆడపిల్ల కూడాను...

"చాలా శుభవర్తమానంచెప్పావు. నీభార్యది ఏవూరు ...ఏమన్నాచదువుకొన్నదా మామూలు వర్రదేనా?


"మొదటనేమో మంత్రసానిపరీక్షఅయింది. తర్వాత నర్సు పరీక్షఆయింది. కొన్నాళ్లు నర్సుగాకూడా వుంటూ వచ్చింది.

అయితే తెల్లతోలా - నల్లతోలా అనే సందేహం వచ్చింది, అయినా తొందరపడి అడగడమెందుకు-ఎట్లాగూ వెళ్లుతున్నాముగదా, తెలియకపోతుందా అనుకొంటూ వుండగానే "ఏం - అడగడం మానివేశావు. నాభార్య ఎంత అందమయిందనుకున్నావు" అన్నాడు జక్కరయ్య

"ఓ అట్లనా-అందులో ఆశ్చర్యమేముంది: నీకు అందమయింది దొరకక అనాకారిది దొరుకుతుందా? ఎన్నాళ్లయింది పెళ్లిఆయి?"

"మూడుసంవత్సరాలయింది. ఆమె నన్ను పెళ్లిచేసుకొంటుందని మొదట నమ్మకంలేకపోయింది. ఒకే మాటేంచేప్పేది ఎంత బాధపడ్డాను అనుకొన్నావు. ఆ విరహవేదనలో ఒక మహాకావ్యంకూడా వ్రాతామనుకొన్నాను. అయితే పాపం - మహాయోగ్యురాలు-పెళ్లి చేసుకొన్నది."

"చక్కదనమేగాకుండా చాలా బుద్ధిమంతురాలని కూడా అనుకొంటాను."



“అనుకోవడమేమిటి? అంతబుద్ధిమంతురాల్ని యీ ముప్ఫయిసంవత్సరాల వయస్సులో యెక్కడా చూడలేదు. మహాకవులు సయితం అంతటి యోగ్యురాలిని కల్పన చేయలేకపోయినారనే నానమ్మకం”

నాకుపయిప్రాణం పయినపోతున్నది. ఎంత అందమయిన వాళ్లకు అంత అందమయినవాళ్లు దొరుకుతారు. నాబోటి వాళ్లకు... చెప్పవలెనా?... జక్కరయ్య చిన్నప్పటినుంచి- సహాధ్యాయిగా వుంటూవున్నరోజులనుంచి వాడు అస్మదాదులయిన బ్రాహ్మణ విద్యార్థులనందరినీ “ఏమిరా అంటే ఏమిరా” అని పిలుస్తూ తిరగడం ఎందుకు సంభవించింది? వాడిరూపరేఖావిలాసాలనుబట్టే... తక్కిన కిరస్తానివాళ్లతో ఎవళ్లయినా కలుపుగోలుతనముగా తిరిగేవాళ్లమా.. లేదు. పయిగా జక్కరయ్యకు బ్రాహ్మణపేరు పెట్టివెంట తీసుకొనిపోయి బ్రాహ్మణ కాఫీహోటల్సులోనూ- బ్రాహ్మహోటళ్లలో శ్రోత్రియ బ్రాహ్మణ పంక్తిలోనూ కూర్చుండబెట్టుకొని భోజనంచేసినాళ్లం... ఎందుల్ల - వాడిదిచక్కని రూపం అయినందువల్ల... లోకంలోడబ్బుంటే చాలునంటారు... కాని నేను అది నమ్మను. కేవలంరూపమువల్లనే ఎటువంటి వాడయినా చెలామణీ అయిపోతాడు...

సాగ్ఘోంలో జక్కరయ్యయింటికి చేరాము.

అది చక్కని చిన్న బంగళా... సముద్రపుగాలి యింట్లో అన్నిగదుల్లోకీ సరాసరిగా రావడానికి అవకాశమువుంది. బయటనుంచిచూస్తేనే యిల్లు యెంతో ముచ్చటగావుంది. ఈ మామూలు మానవ ప్రపంచంలో దేవతలూ-స్వర్గధామమూ వుంటుంది కాబోలు ననుకొన్నాను. నేను వుప్పొంగిపోయినాను. కుర్చీలో జేరగిలబడి చుట్టదీసి ముట్టించి-జక్కరయ్యవంక ఏదిరా నీ భార్య అన్నట్టుచూశాను.

“ఏమిరా మామా - నాభార్యను చూడవలెననేకోరిక లేదుటరా నీకు” అన్నాడు.

“అవశ్యం...”

“పిలుస్తాను...నీకు కాఫీయిష్టమా టీ యిష్టమా... లేకపోతే షర్బత్తు పుచ్చుకొంటావా...ఐస్ క్రీంతింటావా?”

“షర్బత్తే తీసుకురమ్మనరా”

“రైటో” అన్నాడు. ఇంతలో ఏడుఎనిమిదేళ్ల కుర్రవాడు...నల్లగా నేరేడుపండు రంగులోవున్నాడు...ఒక

చిన్న బాటు చేతులో పట్టుకొని జక్కరయ్య దగ్గరకు ముద్దు లుగుసుస్తూ వచ్చి - "డాడీ... ఆడుకొంటాను. గంటలో వస్తాను" అన్నాడు. వాణ్ణి జక్కరయ్య ముద్దుపెట్టుకొని పంపించాడు. వాడెవడో నా కర్థంకాలేదు.

"ఎవడురా వీడు - యీ జంబూద్వీపనివాసి ?"

"నాగృహిణి మొదటి పిల్లవాడు... నేను వితంతువును పెళ్లిచేసుకొన్నాను. నాభార్య మొదటి భర్తకు యీ పిల్లవాడు కల్గినాడు. వీడు పుట్టగానే భర్త పోయినాడు... తరువాత అయిదు సంవత్సరాలక్కు నేను పెళ్లిచేసుకొన్నాను.

"వీడు ఆమె మొదటి భర్తరూపమా ఏమిరా" అన్నాను.

"మొదటి భర్తను నేను ఎరుగను... అయినా వాడిరూపము ఏట్లాంటిదో తెలుసుకోవలసిన ఆగత్యంనాకు పట్ట లేదు"

"అవునులే. వాడిదెట్లాంటి రూపమయితే నేమిలే" అన్నాను. కాని వాడిపెళ్లాన్ని చూదవలెననే కోర్కె మాత్రము యింకా బలమయినది.

వాడు నా అభిప్రాయాన్ని కని పెట్టాడో ఏమో "బాబూ!... నా భార్యను చూడవలెననుకొంటున్నావా ...పిలిచేదా ?" అన్నాడు. నేను మందహాసంచేసి వూరుకొన్నాను.

"బుల్ బుల్" అని పిలిచాడు. లోపలినుంచి "ఇప్పుడే నీళ్లు పోసుకొన్నాను. ఇంకా గుడ్డలు వేసుకోలేదు" అని వినిపించింది. "అయితే నీ భార్య పేరేమిటరా" అన్నాను.

"అసలుపేరు లీల... నేను మాత్రం బుల్ బుల్ అని పిలుస్తాను. రఘువా ...నిజంగా యీ భార్యవచ్చిన తర్వాతనే నేను సుఖమంటే ఏమిటో తెలుసుకొన్నాను. అనుభవిస్తున్నాను. ఇంతసుఖము సంసారంలో వుంటుందని నేను ఏన్నడూ అనుకోలేదు... పయిగా, స్నేహితులుచాలామంది సంసారదుఃఖభాజనముగా వుంటూవుందని చెపుతూవుంటే అందుకు కారణం భార్యఅనే యిప్పుడు స్వానుభవంవల్ల తెలుసుకొన్నాను" అంటూ ఏవో కబుర్లు వాడి భార్యనుగురించి చెబుతూవుంటే ఏప్పుడెప్పుడు వాడి భార్యను చూదామా అనుకొంటూ కూర్చున్నాను. ఆమె రావటము ఆలస్యమయితే వాడికీ కాస్త విసుగెత్తినట్టుగా వుండేది, లేచి లోపలికి వెళ్లినాడు. ఇంతలో ఆమె రెండో ద్వారంలోనుంచి బయటికివస్తూవుంది.



చూచాను. ఉలిక్కిపడ్డాను- నేను ఏమయిపోయినానో నాకే తెలియలేదు. రంగు... రంగేమిటి... ఆరూపము ఎట్లా వర్ణించవలెనో తెలియడంలేదు.

ఒక్క తొండము మాత్రము తక్కువ. ఎదురొమ్ముల మీద ఏనుగ నడిచివెళ్లితే ఏమీచలించని కోడి రామమూర్తి యీమె ఒక్క కాలు వక్షస్థలముమీద పెడితే అణగారి పోతాడనితోచింది. జక్కరయ్యభార్య యీమేనాఅనే సందేహం బాధించడం మొదలుపెట్టింది. ఇంతలో జక్కరయ్యవచ్చి ఆమెతో నేనుతినబాల్యమిత్రుణ్ణిఅనీ అత్యంతాపుణ్ణిఅనీ చెప్పినాడు. ఆమె మందహాసంజేసి షేకుహాండ్ చేయడానికి చేయి అందించింది.

కాళిదాసు ' ఐరావతాస్ఫాలన కర్కశేన ' అంటే ఇంద్రుడు ఐరావతమనే ఏనుగును అరచేతితో చరచడము వల్ల కర్కశమయిపోయిన అరచేయి అన్నాడు అది చదివి నప్పుడు అర్థంకాలేదు. ఇవ్వాళ యీమెచేయి పట్టుకొనే సరికి కాళిదాస ప్రయోగానికి అర్థంద్యోతకమయింది.

నేను ఏవూరివాణ్ణో - ఏకులమువాణ్ణో అంతావిచారించి నాకు పిల్లా మేకాఎంతమందో మొదలయిన విషయాలన్నీ ఏవిధమ్మయిన నదురూ బెదురూలేకుండా అడిగింది. మాకు ఉభయులకున్నూ తాగడానికి షర్బత్తుయిచ్చింది. ఆ పానీయం చాలా రుచిగావుంచి. జిహ్వా లేచి పోయిందంటే ఆశ్చర్యం ఏమీలేదు. ఆమె లోపలికి వెళ్లగానే జక్కరయ్య "రాఘవా - ఏమిటి నాభార్య నిజంగా అందంగావుందా లేదా చెప్పు" అన్నాడు.

"ఏమ్బా; అందంగా లేకపోవడ మేమిటి... నిజంగా అందంగావుంది. భువనయికసుందరి.... అయితే ఒక్క విషయమాత్రం బోధపడింది... మావాళ్లు వినాయకుణ్ణి పూజచేస్తారు. ఆపూజఎందుకుచేస్తారో ఇప్పుడు అర్థమయింది" అన్నాను.

"ఏం... ఇంతలావూ పొడుగూ..."

"అదేం కాదులే... ఒక్కవిషయంచెప్పు నిన్ను ఆమె పెండ్లిచేసుకొందా - నీవామెను పెండ్లిచేసుకొన్నావా?"

"ఒరేయ్... ఈ వెర్రిప్రశ్నలన్నీ వేయడానికి ముందు- నాకళ్లతో ఆమెను నీవు చూడవలెనురా... అప్పుడామెను త్రిజగన్మోహిని అనక తప్పదు"

"అవునురా కాయనా అందుకేరా అడుగుతున్నాను. ఆమెను నీవువరించావా - నిన్నామె వరించిందా?"

"నీప్రశ్న నాకు తెలియకపోలేదు. నన్ను ఆమె వరించిం దంటే ఆశ్చర్యం ఏమీలేదు... నేనే ఆమెను వరించాను. ఆమె మొదటిలో ఎంతమాత్రమూ అంగీక రించలేదు. నాతో చెప్పగూడని విషయాలు కూడా అనేకంచెప్పింది... అందువల్ల నాకు ఆమెమీద మరింత ప్రేమ పుట్టింది. నన్నామె వివాహము చేసుకోక పోయేట్లయితే అన్నం తిన కుండా నీళ్లుతాగకుండా వుండి చచ్చిపోతానని కూడా చెప్పాను. చివరకు మూడురోజులు అన్నం నీళ్లూ లేకుండా వుండిపోయినాను. ఆమెఏమి చెప్పినా లాభంలేక పోయింది. నాల్గోరోజు వుదయానికి ఆమెకు కనికరం పుట్టి నన్ను పెళ్లి చేసుకొంటానని వాగ్దానం చేసింది. తర్వాత వారం రోజులకు పెళ్లిచేసు కొన్నాము. పదకొండో మాసంలో మాకు స్త్రీ శిశువు పుట్టింది.

"ఓరె... నీపిల్లను చూపించవటరా..." అన్నాను.

"బుల్ బుల్... బేబీని పట్టుకొనిరా" అని కేకవేశాడు... లీల పసిబిడ్డను ఎత్తుకొని వచ్చింది. అంతా జక్కరయ్య రూపమే. ఫరవాలేదు; సంతానమయినా వీడి రూపములో వుందని సంతోషించాను.

అయితే యింత అందమయినదాన్ని వీడు ఎందుకు వరించాడో వూహించలేక పోయినాను. మహాభారతంలో భీమసేనుడు హిడింబను వరించాడంటే సమఉజ్జీలని సమాధానం చెప్పవచ్చును. జక్కరయ్య విషయంలో అట్లా అనడానికి ఏమాత్రం అవకాశం లేదు.

చీకటి పడిపోయింది. నాకోసం ప్రత్యేకం తెలుగు బ్రాహ్మణ హోటలునుంచి భోజనం తెప్పించాడు. భోజనం అయితేచేశాను. కాని మతిమతిలో లేదు. ఇంత అందమయిన దాన్ని జక్కరయ్య ఎందుకు వరించాడో ఎంత ఆలోచించినా తోచలేదు. చివరకు వాణ్ణి అడిగే తెలుసుకోవలెనని నిశ్చయించాను. అంతకన్న మార్గాంతరం లేదు. పయిగా మరొకళ్లనూ మరొకళ్లనూ అడగడంకన్నవాణ్ణి అడిగి వాడి ముఖతః కథ అంతా తెలుసుకోవడమే వుచితం.

రాత్రి ఎనిమిదయింది. జక్కరయ్యా భోజనం చేశాడు. నాకవసరమయిన యేర్పాట్లన్నీ చేయడానికి బయటికి వచ్చాడు.

"ఒరే బాబు - ఇక యీరాత్రికి నిద్రవస్తుందనే నమ్మకము ఏమీలేదు. కాస్సేపు యీ ఆరు బయట కూర్చుందామని అనుకొంటున్నాను."

"నాకుమాత్రం యిప్పుడప్పుడే నిద్రవస్తుందనే నమ్మకం లేదులే... కాస్సేపు ఏమయినా కబుర్లు చెప్పవోయి- అయినా మద్రాసు ఏమి పనిమీద వచ్చావురా..."

"కోర్టుపనిమీద" అని వూరుకొన్నాను.

చల్లని సముద్రపు గాలి వీస్తున్నది. ప్రాణము హాయిగా వుంది. దివ్యమయిన సిగరెట్లు యెన్నో వున్నా నా నోటికి సంటకబుర్లు దొర్లేట్టుగా లేవు. అని జిక్కారయ్య కిసి పెట్టాడు.

"ఏమిటిరా ఆలోచిస్తున్నావు - ఎన్నడూ యింతసేపు మాట్లాడకుండా వూరుకోలేవు" అన్నాడు.

"నిన్నుగుర్చించే ఆలోచిస్తున్నాను"

"అయితే వీడు యీమెను ఎందుకు పెళ్ళిచేసుకోన్నాడనేనా నీ ఆలోచన" అన్నాడు.

"అవును"

"అయితే చెబుతా-విను. నేను యం. ఏ. కాగానే యిక్కడ కాలేజిలో ట్యూటరుపని దొరికింది..."

"అవునోయ్ అదంతా తెలుసునోయ్...అప్పుడు - గోదావరి - అనేపిల్లను ప్రేమిస్తున్నట్టు...ఏవేవో చెప్పావు...మరిచిపోయినావు."

"అవునవును. అది గోదావరి - మీ అందరికళ్ళకూ చాలా బాగావుండేది. మీబోటివాళ్ల ప్రోత్సాహం వల్లనే దానిమీద నాకు మనసు అయింది. నిజమే అది తమలపాకులాగా వుండేది. అది నాకు తీరని అపకారము చేసింది. నా హృదయాన్ని చీల్చివేసిందిరా. దాని పేరు చెపితే నాఒళ్లు భగ్గున మండిపోతుంది..."

"ఏమిటి...అప్పుడు నేను వచ్చినప్పుడు అంతా నిశ్చయమయిపోయింది; ఒకవారం రోజులలో పెళ్లి అయిపోతుందని కూడా చెప్పావు జ్ఞాపకం వుందా?

"అబ్బ అదంతా జ్ఞాపకం చేయకు."

"పోనీ టూకీగా చెప్పు"

"ఏదో యింటర్మీడియేటు చదువుతున్నది. అందంగా వుంది. ఫయిగా తండ్రి పరమయోగ్యుడు...ఇంకా యిట్లాంటివి ఎన్నో వూహలు కలిగి దానిమీద మోజుపుట్టింది. దానితో సవాసం చేశాను. నాకువచ్చే జీతంలో మూప్పాతిక దాన్ని సినిమాలకు తీసుకొని పోవడానికే సరిపొయ్యేది. చివరకు ఒకనాడు, దానిసంగతి బయట పడ్డది. మావాడు మా పెత్తండ్రి కొడుకు పెద్ద దున్నపోతులాగా వుంటాడు- నీ వెరుగుదువు - అర్భుదము గాడు - దాన్ని అదివరకే వలలో వేసుకొన్నాడు. దానికీ వాడికీ బాగా కుదిరిపోయింది. అది తండ్రికి యెంతమాత్రమూ తెలియదు. అందుకోసం వాళ్లిద్దరూ ప్లాను వేశారు. నన్ను అది పెళ్లి చేసుకోనేట్లయితే - నేను వెర్రివాడిలాగా వుంటానని వాళ్లిద్దరూ యథాప్రకారం గ్రంథం సాగించ వచ్చునను కొన్నారు. అది ఎట్లాగయితేనేం నాకు తెలిసింది. రెండు రోజులు ముందుగా నాకీ సంగతి తెలియకపోయి వున్నట్లయితే పట్టికొట్టేవాణ్ణే. స్వయంగా కళ్లారా చూచాను. అందువల్ల మానుకొన్నాను."

"అరె ఎంతపని చేసింది!"

"విను చెప్పుతాను. ఆగొడవ అయిపోయిన తర్వాత నాకు ఆడదంటే అసహ్యం పుట్టింది. ఎవతెను గురించి విన్నా యిట్లాంటివే ఏవో వెధవ సంగతులన్నీ బయట పడుతూ వుండేవి. ఆడవాళ్లమీద ఎంత అసహ్యం పుట్టిందంటే పెళ్లి చేసుకోగూడదన్నంత అసహ్యం పుట్టింది. ఇట్లా మూడు సంవత్సరాలు వెళ్లిపోయింది. ఎవరయినా ఆరోజులలో పెళ్లి ప్రశంసచేస్తే తన్నడానికి సిద్ధమయ్యేవాణ్ణి...అట్లా కాలం గడిచిపోయింది ..మూడు సంవత్సరాలనాడు జ్వరం వచ్చింది. మొదట ఏదో జ్వరము అనుకొన్నాను. తర్వాత అది టయిఫాయిడ్ అని డాక్టర్లు అన్నారు. నాకు తలిదండ్రు లెవరూ లేరయిరి. నా అక్క వుద్యోగంలో వుండిపోయి రాలేక పోయింది. జనరల్ ఆస్పత్రికి పోవడానికి నాకెంతో అసహ్యం వేసింది. ఎవరయినా నర్సు దొరికితే యింట్లోనే వుందామనుకొన్నాను. నర్సులు రోజుకు అడిగిన మొత్తం చూస్తే గుండె గుభేలుమంది... ఈమె - లీలమ్మ - నేనున్న యింటి ఎదటి యింట్లో వుంటూ వుండేది. అప్పటికి అయిదారు మాసాలనుంచి ప్రతిరోజూ ఆమెను చూస్తూ వుండేవాణ్ణి. ఆమె ఒకనాడు నా స్థితి తెలుసుకొని చూచిపోవడానికి వచ్చింది. నాస్థితి చూడగానే ఆమె కప్రయత్నంగా కళ్లవెంట నీళ్లు వచ్చినవి. అంతే... నేను కోరనయినా లేదు. నాకు సేవ చేయడానికి సిద్ధమయింది. కాస్త నాకు నయము కాగానే నేను చాలా సామాన్య స్థితిపరుణ్ణే అనీ. నేను ఆమెకు కోరినంత మొత్తం యిచ్చుకోలేననీ - నిష్కపటంగా చెప్పివేశాను. ఆమె ఒక్క నవ్వునవ్వి 'నీవు

బాగా తిరిగేవరకూ వుపచారం చేస్తాను. నీయిష్టం వచ్చినంత యివ్వవచ్చును' అని చెప్పింది. కొద్ది రోజులయ్యేసరికి కాస్త వుసులు చిక్కింది.

ఒకమాసం కాబోలు నాకు బుల్ బుల్ ఉపచారం చేసింది.

ఆమె వున్నయిల్లు మరమ్మతు చేయించదలచి యింటి యజమానులు ఆమెను యింట్లోనుంచి లేవమని నోటీసు యిచ్చారు. ఆమె యింటికోసం బాధపడుతూ వుంటే నాయింట్లో వచ్చివుండమని చెప్పాను."

"ఇక సరే..."

"అబ్బ విను. అంత తొందరగా ఏదో వూహిస్తే ఎట్లా......?

"అవునురా...ఆమెకు నీమీద ఖులాసా పుట్టింది. నీకు ఆమెమీద ఖులాసాపుట్టింది."

"అది కాదోయి బాబు...వూరికా మోజు పుట్టలేదు. నా కప్పటిలో వున్న స్త్రీద్వేషము ఎట్లా పోయిందో— నీకు చెప్పానో లేదో—బుల్ బుల్ నాకంటె నాల్గు సంవత్సరాలు పెద్దది కూడాను..."

"అవును అందువల్లనే ఆమెను పెండ్లిచేసుకొన్నావులే."

"వెర్రిగా మాట్లాడకు విను చివరవరకూ..."

"సరే కానియ్యి"

"ఆమె నాయింట్లో ప్రవేశించిన నాల్గురోజులకే నా వంట వాడు వూరికి వెళ్ళిపోవలసి వచ్చింది. ఆమె యెట్లాగూ స్వంతగా వండుకొనేది. కాబట్టి నాకున్నూ ఆమే చేసి పెడతాననీ, లెక్క ప్రకారం పయికం ఖర్చుపెట్టుకొందామనీ చెప్పింది. సరేనన్నాను...ఏమని చెప్పేది నేను యెప్పుడయినా భోజన సౌఖ్యమంటూ అనుభవిస్తే ఆమె వచ్చిన తరువాతనే..."

"అయితే భోజనానికే బోల్తా...కాదుకాదు...పొరపాటు."

"అది నీకర్థంకాదు లేవోయి...ఎప్పుడో భార్య విషయమయిన హిందూలక్ష్యము...

కార్యేషుదాసీ కరణేషుమంత్రీ

అనేపద్యం చదివాను. అది బుర్రలో చాలా కాలం బట్టి పని చేస్తూవుంది. ఆ పద్యాన్ని సార్థకపరచడానికి యీ ఆమె పుట్టింది..."

"సరే ఆ పద్యములో అన్ని భాగాలతోనూ ఏకీభవిస్తాను. అభ్యంతరం లేదు. అయితే ఒక్కచోటనే సందేహం.

"అన్ని విషయాలూ చెపుదామంటే వినకుండా వున్నావు...పోనీ నీవు అడిగిన విషయానికే సమాధానం చెపుతాను...ఆమే నేనూ వుండడం మొదలుపెట్టి రెండు నెలలయింది. కాలేజిలో పనిఅయి బయటికి వచ్చేసరికి ఆమెను చూడకుండా మరొక చోటికి వెళ్ళేవాణ్ణి కాను. ఏమంటే నాకే చిక్కువచ్చినా ఆమెతో చెప్పేవాణ్ణి - ఆమె అతిజాగ్రత్తతో విని ఎంతో లోకానుభవంతో సలహా చెప్పేది. ఏదయినా నేను తప్పు చేస్తున్నట్టు ఆమెకు తోస్తే వెంటనే వచ్చి ఎంతో మృదువుగా నన్ను ఆమె మందలించేది,

"అబ్బయీ రామాయణమంతా నాకనవసరము. అసలామెను పెళ్ళి చేసుకోవాలనే సంకల్పము ఎట్లా కలిగిందో అది కాస్తా చెపుదూ...తెల్లవార వస్తూవుంది. ఇంతకూ మన యీ సంభాషణ అంతా ఆమె వినడంలేదు కదా?"

"ఆమె వినదు. ఆమెది అట్లాంటి స్వభావం కాదు... నీవు అడిగిన విషయమే చెపుతాను. మేమిద్దరమూ వుండడము ప్రారంభించి మూడు నెలలయిన తర్వాత ఆమె యింకొక వూరికి వెళ్లడం సంభవించింది. ఆమె వెళ్లిపోతుందని తెలిసినప్పుడు అంత విచారం కలగలేదు. వెళ్లిపోయిన నాల్గో రోజునుంచి నాయిబ్బందులు ప్రారంభమయినవి. ఆమె అమృత హస్తముతో పాకము చేస్తే నానోరు తినడానికి అలవాటు పడిపోయింది. నాకు వచ్చే సందేహాలుతీర్చే వారెవరూ లేకపోయినారు. ఏ స్నేహితుడున్నూ అంత జాగ్రత్తగా వినడు. విన్నా నా స్థితిలో తాముండి ఆలోచించరు...ఇన్ని ఎందుకు ఆమె వారము రోజులులేకుండా పోయేసరికి ఒడ్డున వేసిన చేపలాగా అయిపోయింది నాపని...ఎప్పుడు ఆమెను చూతామా అనే ఆలోచన పోవడం మొదల్లు

పెట్టింది... ఇంతలో మాకు ఎండాకాలపు సెలవులువచ్చినవి. ఆ సాయంత్రమే బయలుదేరాను.

ఆమెకు హాస్పిటలు వాళ్లుయిచ్చిన చిన్న బంగళా పెన్నానది వొడ్డున వుంది. నేను బంగళా ప్రవేశించే సరికి మబ్బులలో నుంచి అప్పుడే చంద్రుడు తొంగిచూస్తూ వున్నాడు. వరండాలోకి వెళ్లేసరికే నా కాలి చప్పుడు విని ఆమెలేచి వచ్చింది. ఆమె నన్నుచూసి చిరునవ్వు నవ్వింది. నేను చాలా విచారంతో ఆమెను సమీపించాను. ఆమె యింకా నవ్వుతూ "ఎందుకట్లా విచారంగా వున్నావు" అంటూ నా చెంపమీద అతి మృదువుగా చరిచింది. నేనేమీ మాట్లాడలేదు. 'ఎందుకు మాట్లాడవు' అంటూ నన్ను దగ్గరగా లాక్కొన్నది.

'నీవు లేకపోతే నాకు తోచదు. నేను ఒంటరిగా ఉండలేను' అన్నాను.

'ఎంత వెర్రివాడివి. నేను ఎప్పుడూ నీతో యెందుకు వుంటాను' అన్నదామె. నాకేమి మాట్లాడవలెనో తోచ లేదు. కళ్లలో నీళ్లు గిర్రునతిరిగే స్థితిలో వున్నాను. ఆమె కనిపెట్టింది. నన్ను ముద్దుపెట్టుకొన్నది. నేను అప్రయత్నంగా ఆలింగనం చేసుకొన్నాను. ఆమె నన్ను వారించడానికి ప్రయత్నం చేసింది. కాని లాభంలేక పోయింది. ఆ ఆలింగనములో నేను మాటలతో చెప్పనలవి కాని సుఖం అనుభవించాను. అట్లాగే ఆమె లోపలికి పోవడానికి ప్రయత్నం చేసింది. ఎట్లాగో వుభయులమూ లోపలికి వెళ్లినాము. ఆమెకు కొంచెము కోపం వచ్చింది. కోపభావం ఆమె ముఖంలో ద్యోతకం కాగానే ఆమెను వదిలి పెట్టాను. ఆమె అవతల గదిలోకి వెళ్లిపోయింది. ఒకక్షణం సేపయిన తర్వాత ఏమి చేస్తున్నదో నని వెళ్లి చూచాను. ఆమె ఏదో ఆలోచిస్తూ నిలుచుని వుంది. అలికిడి పట్టి వెనక్కుతిరిగి చూసింది. నేను కనిపించాను. ఆమెచేతులు అడ్డంగా పెట్టుకొని "వద్దు వద్దు" అన్నది. "కాదు కాదు" అంటూ మళ్లీ ఆలింగనం చేసుకొన్నాను...ఇక తక్కిన సంగతి చెప్పలేను...

ఉదయం అయింది. ఆమె కనిపించలేదు. ఆమె కోసం వెతికాను. ఆమె డ్యూటిలోకి వెళ్లిపోయింది. సాయంకాలము వరకూ కాలుగాలిన పిల్లిలాగా తిరిగాను. సాయంత్రం ఒక్కసారి కనిపించి ఏదో పనివుందని చెప్పి వెళ్లిపోయింది. ఇట్లా మూడురోజులు మాట్లాడడానికయినా అవకాశమీయకుండా తప్పించుకొని తిరిగింది.

"కథకు అడ్డం తగులుతున్నానని కోపపడకు...పిల్లవాడి కోసమయినా యింటికిరా లేదుటరా?"

"ఓ, మరిచి పోయినాను. చెప్పలేదు కాబోలు. పిల్లవాడీమె అప్పదగ్గరవుంటూ వుండేవాడు. నేను పెళ్లి చేసుకొన్న తరవాతనే నాకోరికమీదనే వాణ్ణి తీసుకొని వచ్చింది.

నాల్గోరోజువుదయంకూర్చుని ఆలోచించాను. రూపమూ రూపానికి అంతరమందువుండే గుణమూ మనుష్యుడికి ఆనందమిచ్చేది? పయిగా రూపానికి నిలకడ ఏమిటుంది?...నా హృదయానికి-నా మనస్సుకి-నా దేహానికి అవీ ఇవీ ఏమిటి నా ఆత్మకు ఆనందం ఆమెవల్ల కలిగినప్పుడు నాకు ఆమె సహచారి-సహధర్మిణి కావలెను. మరొకతెతో నాకేమీ నిమిత్తములేదు అని నిశ్చయించాను.

ఆమె అయిదో రోజు మెల్లిగా యింటికి వచ్చింది. నేను ఆమెను పెళ్లిచేసుకోవలెనని నిశ్చయించుకొన్నట్టు చెప్పివేశాను. ఆమె నవ్వి పెళ్లి చేసుకోనని చెప్పింది. నేను నిర్బంధించాను. ఆమె అప్పుడు తనకొక కొమారుడున్నట్టు చెప్పింది. అయినా నేను చేసుకోక తప్పదన్నాను. భర్తృవియోగమయిన తరువాత ఒకానొకరితో సంబంధం కలిగిందన్నది. అయినా ఫరవాలేదన్నాను. చివరకు అత్యంత విచారముతో యిప్పుడు నీ అభిప్రాయము ఎట్లావున్నా కొన్నాళ్లకయినా నారూపం బాగుండనట్టు తోస్తుంది. అప్పుడు చిక్కులు వస్తవని చెప్పింది. కాదు సుతరామూ అట్లా అభిప్రాయము నాకెన్నడూ కలగదు. నీవు నాకంటె నాల్గయిదు సంవత్సరాలు పెద్దదానివి అని కూడా తెలుసును. అయితే నేను భార్య అనే స్త్రీకి వుండవలెననీ కాంక్షించే అన్ని లక్షణాలూ నీకు పట్టినవి. అందువల్ల పెళ్లిచేసుకో దలచుకొన్నాను అని చెప్పినాను. ఆమె నామాటలు వినలేదు. నన్ను పెళ్లిచేసుకోక పోయినట్లయితే దేహం త్యజించివేస్తానని అఖరుకు చెప్పాను. మూడు

రోజులు ఆమె యింట్లోనేవుండి వుపవాసము చేశాను. మొదటిరోజు ఆమెకు నవ్వులాటగా తోచింది. రెండో రోజు ఆమెకుకొంత ఆలోచన ప్రారంభమయింది. మూడో నా దుడుదుకుం ఏమేమో చెప్పింది. నేను వినలేదు. నాస్థితికి ఆమె హృదయం కరిగి పోయింది. చివరకు 'మొగవాళ్లు ఎప్పుడూ గుణము విషయం తలపెట్ట నే తలపెట్టరు. రూపానికి వ్యామోహపడుతారు. అది నా అనుభవం' అన్నది. 'నీ అనుభవం తప్పు. రూప వ్యామోహం యిదివరకే నాకు అయిపోయింది. ఇప్పుడు నాకు కావలసింది గుణమే' అన్నాను. ఆమె నవ్వుతూ వెళ్లిపోయి నిమ్మపండ్ల రసముతో అప్పటి కప్పుడు షర్బత్తుచేసి పట్టుకొని వచ్చి యిచ్చింది... ఆమెను సాలోచనంగా చూశాను... ఆమె మందహాసం చేసింది, ఆమందహాసంలో ఒక మహాప్రపంచం తోచింది. అది మనుష్యులుండే ప్రపంచం కాదు. అది దేవతలుండే ప్రపంచం... అప్పుడే వివాహం చేసుకోడానికి నిశ్చయించుకొన్నాము.

వారం రోజులకు వివాహం చేసుకొన్నాము.

ఇప్పటికి మూడు సంవత్సరము లయిపోయింది. నాకు సంసార సంబంధమయిన విచారమంటూ ఏమీలేదు. ఇది వుంది; ఇదిలేదు అనే దేమిటో నాకు తెలియదు. నాకే క్షణానికేమి కావలెనో అదంతా నా యిల్లాలు చేకూరుస్తుంది. కాలేజిలో నాధర్మాన్ని నిర్వర్తించి మాసాంతముకు జీతము పట్టుకొని రావడము మాత్రము నావంతు. తక్కిన నా సౌఖ్యము లన్నీ చేకూర్చడం ఆమెవంతు. ఈనాడు యీదేశంలో నేనొక పెద్ద విద్వాంసులలో ఒకణ్ణి అనేకీర్తి గణించి వున్నట్లయితే దానికంతా నాయిల్లాలు బుల్-బులే కారణము... ఇంకా యెన్నో పనులు చేయవలెనను కొంటున్నాను. ఆమె సాయముతో చేస్తాను.

'ఒరే... అంతా బాగావుంది. ఇందుకే కాబోలురా- పూర్వం మనవాళ్లు యిల్లు ఇరకటం ఆలు... ఏదో అన్నారు. అయితే యిల్లు మాత్రము యిరకటంగాలేదు. అది కూడా పూర్తిచేస్తే యింకా నీవు గొప్పవాడివి అవుతావు'' అన్నాను.

"చాలులేవోయి నీ ఆపా మాషీలు..."

"సరే టయిము ఎంత అయిందో చూడు... చాలా పొద్దు పోయినట్లుంది"

జక్కరయ్య చేతినున్న గడియారం చూసి "అబ్బ చాలా టయిము అయింది. మూడుం ముప్పావు అయింది. ఇకలే పడుకొందాము" అన్నాడు.

లేచి వుభయులమూ వరండాలోకి వెళ్లాము. లీలమ్మ లోపలినుంచి... "పడుకొంటారా... యింకా మాట్లాడుకొంటారా..." అని అడిగింది.

"లేదు పండుకొంటాము" అన్నాడు జక్కరయ్య.

"అయితే- యీపాళంగా పడుకొనేట్లయితే జబ్బు చేస్తుంది. కాళ్లూవేళ్లూ తీర్చుకోండి. వేడినీళ్లు కాగుతున్నవి. స్నానం చేయండి. తర్వాత కొంచెంగా తిని పడుకోండి. మధ్యాహ్నము ఏ పన్నెండిటికో నిద్ర మెళకువ వస్తుంది. అప్పుడు హాయిగా వుంటుంది"

ఉభయులమూ అంగీకరించాము. ఆ అర్ధ రాత్రి వేళ యెప్పుడు యీ యేర్పాట్లన్నీ చేసిందో నాకర్థం కాలేదు. స్నానంచేసి వచ్చే సరికి బిస్కట్లూ కాఫీ యిచ్చింది. ఆ కాఫీ ఒక్క కప్పుతాగితే ఒక్క సంవత్సరము ఆయుర్దాయము వృద్ధి అవుతుంది. మరి ఎట్లా కని పెట్టిందో ఏమిటో... నాకు మాత్రము యింకొక కప్పు యీయ వచ్చింది. మర్యాద కోసం 'వద్దు' అన్నాను.

ఆమె నవ్వుతూ... "మీరు నేను అప్పలాంటిదాన్ని. మీరు యింకొక కప్పుతాగవలె ననుకొన్నారు. పుచ్చుకోండి మొహమాట పడకండి," అన్నది.

ఇక నేను నోరెత్త లేక పోయినాను. మెదలకుండా వెర్రి వెంగళాయ లాగా తాగేశాను.

అపాళంగా పడుకోడానికి మంచము చూపించింది. మహాకవులు పుస్తకాలలో వర్ణించే హంసతూలికా తల్పముల వర్ణనలు అప్రయత్నంగా స్ఫురణకు రావడం మొదలు పెట్టినవి...

జక్కరయ్యవచ్చి "ఏమిరా... పక్కా గిక్కా ఖులాసాగా వుందా" అని ప్రశ్నించాడు.

"అదంతా నాకు తెలియదు. ఈరాత్రికే యింటికివెళ్లి నాభార్యను పట్టుకొని వస్తాను. నాభార్యకు కాస్త త్రియి

నింగ్ నీ భార్య యిస్తుందేమో కనుక్కోండూ..."
అన్నాను.

జక్కరయ్య వచ్చాడు. పక్కనుంచి లీలమ్మ. "మీరు బ్రాహ్మణులు. మీరంటే వచ్చారు. మీ యిల్లాలు మా యింటికిరాను. మేము క్రిస్టియనులము అన్నది."

"మీరు క్రిస్టియన్లు అయితేనేం? కామధేనువు యీ రూపంలో యిక్కడ అవతరించిందని చెప్పి తీసుకొని వస్తాను."

"సరే ముందు నిద్రపోండి తర్వాత ఆలోచింతాము" అన్నది లీలమ్మ.


# ఇటు చూడండి

వాళ్ళనూ వీళ్ళనూ ఆలోచించి మీ డబ్బునూ కాలాన్ని శక్తినీ ఏలవృథా చేసుకొంటారు? మా

## అద్భుత దుర్భిణి

(Miraculous Glass)

సహాయంతో మీ మీ విషయాలు మీరే పరిష్కారం చేసుకోవచ్చును.

ఈ దుర్భిణి కైలాస పర్వత ప్రాంతాలలో దొరికే అనేక ఔషధులతో తయారు అయింది. దివ్యమయిన పెట్టెలో అమర్చినాము. దీని ఉపయోగములు గమనించినప్పుడు మీరాశ్చర్యపడక తప్పదు.

మీరు—ఆడవారయినా మొగవారయినా ఏ కులము వారయినా ఏ వయస్సువారయినా అతిసులువుగా యథార్థమయిన గణితమూ లేకుండా ఏ జ్యోతిషికుడి సహాయమూ లేకుండా భూతభ విష్యద్వర్తమానములు తెలుసుకోనవచ్చును. చనిపోయిన మీ మిత్రులను బంధువులనూ చూడవచ్చును. మాట్లాడవచ్చును. దూరదేశాలులో వున్న బంధువులను చూడవచ్చును. భూమిలో వున్న ధనాన్నీ-దొంగిలించుకొనిపోయి దాచిన వస్తువులు యెక్కడవున్నదీ తెలుసుకోనవచ్చును. సంసారిక విషయాలులోనూ వ్యాపార విషయాలులోనూ చక్కని సలుహాలు పొందవచ్చును లాటరీ మొదలయిన నాట్ల నెంబర్లు మొదలయిన గుర్రపు పందేంలో గెల్పు పరిక్షలలో జయము పొందడమూ దావాలలో గెలవడమూ మొదలయినవి అతిసులువుగా యీ అద్దంవల్ల పొందవచ్చును. సుభంగానూ ఆరోగ్యంగానూ వుండడానికి మార్గాలు అన్నీ తెలుస్తవి. ఇన్ని ఎందుకు యిది "నిజమయిన మిత్రుడు" అని చెప్పవచ్చును.

అందరికీ సులభ సాధ్యంగా వుండే ఖరీదు. దీనివల్ల లాభం పొందక పోయినచో పాకింగ్ పోస్టేజి ఖర్చులుమినాహాయించుకొని డబ్బు వాపసు యిచ్చే గ్యారంటీ పత్రముతో సహా వెల రూ. 3 (5 షిల్లింగు 100 U. S. A.) డబ్బు అడ్వాన్సుగా పంపవలెను. ప్యాకింగ్ పోస్టేజి ఖర్చులు ప్రత్యేకం 8 అణాలు.

ఉత్తరములు యింగ్లీషులోనే వ్రాయువలెను.

The Manager: SPIRITUAL BUREAU
119, Bhaghur Road, DEV?ALI (Camp)




## మన్మథ శాస్త్రము

ముఖ్యముగ అందఱు చదువవలసినది

వెల 8 అణాలు.

దిఓరియంటల్ బుక్ డిపో మద్రాసు






*Madras Agents:—* **C. J. Sheth**